## చట్టాలపై అవగాహన ఏర్పరచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ, జడ్జి

పరిగి, ఫిబ్రవరి 14 : విద్యార్థులు పలు చట్టాలపై అవగాహన ఏర్పరచుకోవాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ, జడ్జి డి.బి.శీతల్ పేర్కొన్నారు. శుక్రవారం పరిగిలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకులం, బాలసదన్, పరిగి సబ్‌జైల్‌ను జడ్జి సందర్శించారు. ఈ సందర్భంగా గురుకులంలో జరిగిన సమావేశంలో జడ్జి శీతల్ మాట్లాడుతూ బాలల హక్కులు, బాల్య వివాహాలు, పోక్సో చట్టం, కిడ్నాప్‌లు, దొంగతనాలు, బాలకార్మికులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. చట్టాలపై అవగాహన ఏర్పరచుకోవడంతోపాటు తమ తల్లిదండ్రులను చైతన్యవంతులను చేయాలన్నారు. చదువు ద్వారానే దేన్నయినా సాధించవచ్చని, చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఫెన్స్ న్యాయవాదులు రాము, శ్రీనివాస్, పరిగి లీగల్ ఎయిడ్ న్యాయవాది గౌస్‌పాష, మోహన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ అధ్యాపకుడిగా భాస్కరయోగి



పరిగి, ఫిబ్రవరి 14 : పరిగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ పి.భాస్కరయోగి జిల్లా ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్ చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారి శంకర్‌నాయక్, కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమారస్వామి పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



మర్పల్లి, ఫిబ్రవరి 14: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. శుక్రవారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, రావులపల్లి గ్రామ నాయకులతో కలిసి ఆనంద్‌ను కలిశారు. కార్యక్రమంలో నాయకుడు రాంచందర్, ఆనంద్, కృష్ణ, వేణుగోపాల్, మహేందర్, తరుణ్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శుభప్రద్‌పటేల్‌ను కలిసిన మండల నేతలు



వికారాబాద్, ఫిబ్రవరి 14 : బీఆర్‌ఎస్ వికారాబాద్ మండల నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మహిపాల్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన పడిగళ్ల అశోక్ శుక్రవారం రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్‌పటేల్‌ను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శుభప్రద పటేల్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మండలంలో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు.

## కుక్కింద పాఠశాలలో కలం స్ఫూర్తి యాత్ర



కుక్కింద పాఠశాలలో బస్సు యాత్రలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ధారూరు, ఫిబ్రవరి 14: రాష్ట్రంలోని 33 జిల్లాలను సందర్శిస్తూ విద్యార్థులకు భవిష్యత్తు సాంకేతికతలను అందించేందుకు కలం స్ఫూర్తి యాత్రలో భాగంగా ధారూరు మండల పరిధిలోని కుక్కింద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కుక్కింద, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ధారూరు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నాగసముందర్ పాఠశాలల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ బస్సు యాత్రలో రోబోటిక్స్, ఏ1, ఏఆర్, వీఆర్, డ్రోన్స్, 3డీ, ప్రింటింగ్, వంటి, 16 రకాల అత్యాధునిక సాంకేతికతలు ప్రదర్శించారు. కార్యక్రమంలో కుక్కింద పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కడియాల చంద్రశేఖర్, నాగసముందర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేశ్, ఉపాధ్యాయులు విశ్వేశ్వర్, రవీందర్‌రెడ్డి, కమల్‌రెడ్డి, పాలో టీమ్ సీఈవో మధులాష్ బాబు, అజయ్ రెడ్డి, సుబ్రమణ్యం, దిలీప్ కుమార్, రోహిత్ ఉన్నారు.

## బండల ఎల్లమ్మ జాతరకు పోటెత్తిన జనం..



కొడంగల్, ఫిబ్రవరి 14: పట్టణ శివారులోని బండల ఎల్లమ్మ జాతరలో భక్తులు పోటెత్తారు. మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా సాగే ఈ జాతరకు మండల పరిధిలోని ప్రజలే కాకుండా దూరప్రాంతల నుంచి తండోపతండాలుగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త కుటుంబీకులు అమ్మవారికి పంచామృతాలతో, గంగాజలంతో అభిషేకించి ప్రత్యేక అలంకరణతో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణ, అభరణా లతో శోభాయమానంగా వెలిగిపోయారు.

## ఎస్సీ వర్గీకరణను తక్షణమే రద్దు చేయాలి



తాండూరు: నిరసన వ్యక్తం చేస్తున్న మాలమహానాడు ప్రతినిధులు

తాండూరు, ఫిబ్రవరి 14: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాలలకు తీరని ద్రోహం చేస్తుందని అందుకు వ్యతిరేకంగా శుక్రవారం తాండూరు నియోజకవర్గంలో మాలమహనాడు ఆధ్వర్యంలో నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. తాండూరు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ముందు చేసిన నిరసన కార్యక్రమంలో మాల మహనాడు తాండూరు నియోజకవర్గం అధ్యక్షుడు బి.కృష్ణ మాట్లాడుతూ ఎస్సీ జాబితాలోని 59 కులాలకు రిజర్వేషన్ అవకాశాలు లేకుండా కాంగ్రెస్ సర్కార్ మెజార్టీ దళిత కుటుంబాలకు అన్యాయం చేస్తున్నదని పేర్కొన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను తీసుకురాగ హైకోర్టు కొట్టివేసిందని గుర్తు చేశారు. ఎస్సీలను విభజించాలనే కుట్రతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం కుమ్మక్కై సుప్రీం కోర్టుకు తప్పుడు నివేదికలు ఇచ్చిందన్నారు. మాల, మాదిగ కులాల్లో చిచ్చు పెట్టే ఎస్సీ వర్గీకరణను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు, ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమం లో మాలమహనాడు ప్రతినిధులు శేఖర్, లాలప్ప, రాములు, మల్లప్ప, జగదీశ్వర్, విజయ్‌కుమార్, శానప్ప, కాశప్ప మల్లేశం, రమేశ్, రమాకాంత్, నరేశ్, శ్రీనివాస్ వెంకటయ్య తదితరులున్నారు.

**పెద్దేముల్:** ఎస్సీ వర్గీకరణను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎస్సీ జాబితాలో 59 కులాలకు రిజర్వేషన్ అవకాశాలు లేకుండా , కాంగ్రెస్ సర్కార్ మెజార్టీ దళిత కులాలకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపిం చారు. మాలలను తక్కువ జనాభాగా చూయించి ఐదు శాతం కేటా యించి తీవ్రంగా ద్రోహం చేశారన్నారు. కార్యక్రమంలో పెద్దేముల్ మాలల మండల అధ్యక్షుడు అంజయ్య, ఉపాధ్యక్షుడు మల్లేశం, రమేశ్, మాజీ మండల అధ్యక్షుడు రమాకాంత్, రాములు, శ్రీనివాస్, మాణెప్ప, మల్లయ్య, నర్సిములు, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దేముల్: నిరసన వ్యక్తం చేస్తున్న మాలమహానాడు నేతలు

## కిటికీ పడి చిన్నారి మృతి



పరిగి, ఫిబ్రవరి 14 : ఆడుకుంటున్న నాలుగేళ్ల చిన్నారిపై కిటికీ పడి తీవ్ర గాయాలపాలై మృతి చెందిన సంఘటన పరిగిలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే దోమ మండలం బ్రాహ్మణ్‌పల్లితండాకు చెందిన నేనావత్ హన్మంతు, ఆయన భార్య చాందిబాయిలు కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారికి కుమారుడు అముల్‌సింగ్, కూతురు సోనా అలియాస్ అమూల్య(4) ఉన్నారు. కూతురు చిన్నగా ఉండడంతో ఇంటి నిర్మాణ పనులకు వెళ్లే సమయంలో తల్లి చాందిబాయి కూతురును తీసుకొని వెళ్తుంది. కూతురు ఆడుకుంటుండగా తాను పని చేస్తుంది. శుక్రవారం హన్మంతు తుంకులగడ్డలో కూలీ పనికి వెళ్లగా ఆయన భార్య చాందిబాయి పట్టణంలోని బాలాజీనగర్‌లో చౌదరి శ్రీనివాస్‌రెడ్డి ఇంటి దగ్గర పని చేస్తుంది. మధ్యాహ్నం 3.45 గంటల ప్రాంతంలో చాందిబాయి పని చేస్తుండగా అక్కడే ఆడుకుంటున్న చిన్నారి అమూల్య(4)పై గోడకు నిలబెట్టి ఉన్నటువంటి కిటికీ పడింది. దీంతో అమూల్య తలకు, చాతి భాగంలో గాయాలయ్యాయి. వెంటనే చిన్నారిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. హన్మంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

## తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

బషీరాబాద్, ఫిబ్రవరి 14: వేసవి సమీపిస్తుంది గ్రామంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ వెంకటేశ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మంతన్‌గౌడ్ తండా పంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి హామీ, పారిశుధ్యం తాగు నీటి సరఫరాపై పంచాయతీ కార్యదర్శి అడిగి తెలుసుకున్నారు. వేసవిలో ఇబ్బందులు లేకుండా మంచినీటి పైపు లైన్‌లు లీకేజీలు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే గ్రామంలోని రేషన్ దుకాణానికి వెళ్లి రికార్డులను పరిశీలించారు. గడువు వరకు దుకాణం తెరిచి సరుకులు పంపిణీ చేయాలని డీలర్‌ను ఆదేశించారు.

## స్నేహితుడి అంత్యక్రియలకు ఆర్థిక సాయం

దోమ, ఫిబ్రవరి 14: దోమ మండల పరిధిలోని దొంగ ఎన్కెపల్లి గ్రామానికి చెందిన బాన్‌పల్లి చంద్రయ్య(38) గురువారం మధ్యాహ్నం అకస్మాత్తుగా మృతి చెందాడు. మృతుడు చంద్రయ్య కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2001-2002 విద్యా సంవత్సరంలో పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థి. విషయాన్ని తెలుసుకున్న వారి క్లాస్‌మేట్స్ అందరూ కలిసి ఆయన అంత్యక్రియలకు గాను 16 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని చంద్రయ్య కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో శేరిరామ్ రెడ్డి, బాబ్య, శ్రీనివాస్, బాల్‌రాజ్, ఈశ్వరయ్య, దేవ్‌సింగ్,బాధితుని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల విధుల బహిష్కరణ



తాండూరు, ఫిబ్రవరి 14: తాండూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం తాండూరు కోర్టు న్యాయవాదులు విధులు బహిష్కరించారు. రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ కోర్టులో మహిళా జడ్జీపై ఖైదీ చెప్పు విసరడాన్ని నిరసిస్తూ తాండూరు న్యాయవాదులు కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తాండూరు బార్ అసోషియేషన్ అధ్యక్షుడు అగ్గనూరు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు శ్రీనివాస్‌రెడ్డి, మనోహర్‌రావు, పాశ్యం రవికుమార్, రవిందర్, విశ్వనాథ్ తదితరులున్నారు.

## పంట సంరక్షణపై అవగాహన..



ధారూరు, ఫిబ్రవరి 14: వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచించిన సాగు విధానాలను పాటించడం ద్వారా రైతులు అధిక దిగుబడిని సాధించవచ్చని ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అవుసుపల్లి గ్రామంలో డాక్టర్ యమున, ఏఈవో సంతోష్‌కుమార్‌తో కలిసి వ్యవసాయ శాఖ కళాశాలలో నాలుగో సంవత్సరం చదవుతున్న విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా రైతుల పంటపొలాలను సందర్శించి పంట సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని కళాశాల విద్యార్థులు సర్వే నిర్వహించి సామాజిక చిత్రపటాన్ని చిత్రించారు.

## భవన నిర్మాణ సెంట్రింగ్ కార్మికుల ఆందోళన




వికారాబాద్, ఫిబ్రవరి 14: భవనాల నిర్మాణంలో సెంట్రింగ్ పనులు ఎంతో కీలకమని, ఫీట్‌కు రూ.130లు చెల్లించి భవన సెంట్రింగ్ కార్మికులను ఆదుకోవాలని భవన నిర్మాణ సెంట్రింగ్ సంఘం వికారాబాద్ అధ్యక్షుడు గుర్రాల నాగరాజు అన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఆలంపల్లి అనంత పద్మనాభ ఆలయం నుంచి భవన నిర్మాణ కార్మికుల భవనం వరకు సెంట్రింగ్ కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... వికారాబాద్ లో పనులు చేసే సెంట్రింగ్ వర్కర్స్‌కు చాలా ఏండ్ల నుంచి ఉన్న ధర ఫీట్ కు రూ.110 చెల్లిస్తున్నారని, కానీ పెరిగిన ధరలకు అది ఏ మాత్రం సరిపోవడం లేదన్నారు. అందుకే నూతనంగా నిర్మించే భవనాలకు ఫీట్ కు రూ. 130 చెల్లించి కార్మికులకు అండగా ఉండాలన్నారు. సెంట్రింగ్ కు వాడే సామగ్రి ధరలు, కూలీలకు కూలీ పెరగడంతో ధరలు పెంచాలని తమ సంఘం అనుకుందని వివరించారు. అందుకే ఈ నెల 14 నుంచి 17 వరకు సెంట్రింగ్ పనులు స్వ చ్ఛందంగా బంద్ చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఆ సంఘ ఉపాధ్యక్షుడు ఊషయ్య, సెక్రటరీ లక్ష్మయ్య, జనరల్ సెక్రటరీ దేవయ్య, కోశాధికారి రహమత్ ఆలీ, సభ్యులు యూసుఫ్, ఖలీద్, తయ్యర్, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు సేవాలాల్ జయంతి వేడుకలు

కులకచర్ల, ఫిబ్రవరి 14 : చౌడాపూర్ మండల పరిధిలోని మక్తవెంకటాపూర్ గ్రామంలో శుక్రవారం సేవాలాల్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు వికారాబాద్ జిల్లా లంబాడా హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గోపాల్‌నాయక్ తెలిపారు. గురువారం కులకచర్ల మండల కేంద్రంలో వివిధ తండాల నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. శుక్రవారం మక్త వెంకటాపూర్ గ్రామంలో సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆయా గ్రామాల్లోని గిరిజన తండాలో బోగ్‌బండార కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు కులకచర్ల మండల కేంద్రానికి చేరుకోవాలని అక్కడి నుంచి చౌడాపూర్ మండలంలోని మక్తవెంకటాపూర్ గ్రామంలో జరిగే సేవాలాల్ జయంతి కార్యక్రమానికి భారీ ఎత్తున ర్యాలీగా వెళ్లాలని అన్నారు. కులకచర్ల మండలం నుంచి బంజారా వేశాధారణలో రావాలని విఠల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాంచందర్‌నాయక్, గోపాల్‌నాయక్, పాండు నాయక్, విష్ణు, వినోద్, హన్మంతు, ప్రకాశ్, రమేశ్, శంకర్, బాబు, గోపాల్, అంబదాస్, రాము, బంజారా సంఘం నాయకులు పాల్గొన్నారు

## సీసీ రోడు పనులు ప్రారంభం

ధారూరు, ఫిబ్రవరి 14: మండల పరిధిలోని అల్లాపూర్ గ్రామంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నిధులు రూ.ఐదులక్షలుతో సీసీ రోడ్డు పనులకు గ్రామ నాయకులు శుక్రవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎంపీకి, నాయకులు వడ్ల నందు, మాధవరెడ్డి, రాజూనాయక్‌లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో యాదగిరి, శివానంద్, రాజు, నరేందర్, యాదప్ప, బాలప్ప, నర్సింహులు, ఆంజనేయులు పాల్గొన్నారు.

## 26 కిలోల గంజాయి పట్టివేత..



వికారాబాద్, ఫిబ్రవరి 14: వికారాబాద్ జిల్లా కేంద్రంలో గంజాయి రవాణా, అమ్మకాలు చేస్తున్న ఓ వ్యక్తిని జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం పట్టుకుంది. డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ సీఐ కె. శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.... జిల్లా మద్య నిషేధ, ఆబ్కారీ అధికారి విజయ భాస్కర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం గంజాయి కేసు నమోదు చేసినట్లుగా తెలిపారు. వికారాబాద్ రైల్వే ఆఫీసర్ విశ్రాంతి భవన పరిసర ప్రాంతం వికారాబాద్ టౌన్‌లో ఒక వ్యక్తి గంజాయి రవాణా , అమ్మకాలు చేస్తున్నాడని, విశ్వసనీయమైన సమాచారం వచ్చిందన్నారు.

ఈ మేరకు జిల్లా ఎక్సైజ్ స్టేషన్ , ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ బృందం దాడులు నిర్వహించి గంజాయి తరలిస్తున్న సన్నీ సేథ్‌ను పట్టుకున్నారు. అతని వద్ద 26.789కిలోల ఎండు గంజాయి లభించిందన్నారు. అతడిని విచారించగా... వెస్ట్ బెంగాల్ రాష్ట్రంలోని శిబిపూర్ జిల్లాకు చెందిన వ్యక్తి అని గుర్తించామన్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ సీఐ కే శ్రీనివాస్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై ప్రేమ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది విష్ణువర్ధన్‌రెడ్డి , శివ , రాంగణేశ్, మహేందర్ , కుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయురాలికి అండగా..



బషీరాబాద్, ఫిబ్రవరి 14 : పనులు చేయకుండానే బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు ఉపాధ్యాయురాలిపై ఒత్తిడి తేవడంతో మనోవేదనకు గురైన ఉపాధ్యాయురాలు సుప్రియను పీఆర్‌టీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం భోజన విరామ సమయంలో పాఠశాలను సందర్శించి ఆమెకు మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని ఎక్మాయి ప్రాథమిక పాఠశాలకు అమ్మ ఆదర్శ పాఠశాల కింద పాఠశాల మరమ్మత్తులకు, విద్యుత్ సరఫరాకు, మంచినీటి ఏర్పాటుకు నిధులు మంజూరైయ్యాయన్నారు. అయితే పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు తూతు మంత్రంగా చేసి బిల్లులు చెల్లించాలని ఉపాధ్యాయురాలు సుప్రియపై వత్తిడి తెచ్చారన్నారు. అంతేకాకుండా ఏఈ ద్వారా ఎంబీ చేయించుకొని డబ్బులు ఇవ్వాలని బలవంతం చేయగా ఆమె నిరాకరించారని రకరకాల వ్యక్తులతో దుర్భాషలాడిస్తూ మానసిక వేదనకు గురి చేస్తున్నారని, ఆమెకు అండగా ఉంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, రవీందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, రవికాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈశ్వర్‌గౌడ్, విజయ్ కుమార్, సంఘం బాధ్యులు శ్రీనివాస్‌గౌడ్, ముస్తఫా, గోవర్ధన్‌గౌడ్, బీమప్ప, ఎల్లప్ప, శ్రీనివాస్, సదాశివయ్య ఉన్నారు.

## మోత్కుపల్లి-అనంతగిరిపల్లి రోడ్డు పనులు ప్రారంభం



బంట్వారం/కోట్‌పల్లి, ఫిబ్రవరి 14: కోట్‌పల్లి మండల పరిధిలోని మోత్కుపల్లి-అనంతగిరిపల్లి ఆర్‌అండ్‌బీ డబుల్ లైన్ రోడ్డు అభివృద్ధి పనులను శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజక వర్గంలోని ప్రధాన రహదారులను రెండేండ్లలో అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఇప్పటికే అనేక గ్రామాల రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేశామని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం మోత్కుపల్లి-అనంతగిరి ఆర్‌అండ్‌బీ రోడ్డు అభివృద్ధికి గాను సీఆర్‌ఐఎఫ్ నిధులు రూ.30.00 కోట్లతో డబుల్ లైన్ రోడ్డును ప్రారంభించామన్నారు.

## ప్రమాదవశాత్తూ గుడిసె దగ్ధం

కులకచర్ల, ఫిబ్రవరి 14 : మండల పరిధిలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో గురువారం రాత్రి గ్రామానికి చెందిన ముత్యాలయ్య గుడిసెకు నిప్పంటుకొని పూర్తిగా దగ్ధం కాగా శుక్రవారం కులకచర్ల తహసీల్దార్ మురళీధర్ రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. బాధిత కుటుంబానికి జరిగిన నష్టం వివరాలను కలెక్టర్‌కు నివేదించనున్నట్లు తెలిపారు. తక్షణ సహాయంగా 10కిలోల బియ్యంను అందజేశారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి, అడ్వకేట్ నర్సింహులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తగిన ఆర్థిక సాయం అందే విధంగా చూస్తామని తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

GOLD FINANCE

★మీ బంగారం మణప్పరం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916. స్పాట్ క్యాష్.

NT-337308_All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి
తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962